మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

పేట ప్రభుత్వాసుపత్రిలో సిటీస్కాన్ సేవలు ప్రారంభం

నారాయణపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త : నారాయణపేట మండలం అప్పక్‌పల్లి సమీపంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక సిటీ స్కాన్ సేవలను ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో వైద్యసేవల బలోపేతం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సిటీ స్కాన్ యంత్రం ప్రారంభం కావడంతో ఇకపై నారాయణపేట ప్రజలు వైద్య పరీక్షల కోసం మహబూబ్ నగర్, హైదరాబాద్ వంటి దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లా కేంద్రంలోనే ఆధునిక వైద్య సదుపాయాలు లభిస్తాయని తెలిపారు. ప్రజలకు ఆరోగ్య భద్రత ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నాం ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతోనే మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో వైద్య రంగాన్ని అభివృద్ధి పరచడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. త్వరలోనే డయాలసిస్ యూనిట్లు,ఆధునిక ల్యాబ్ సదుపాయాలు కూడా మరింత విస్తరించబడతాయి అని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆధునిక వైద్య పరికరాల ప్రారంభం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. రోగులు వారి కుటుంబ సభ్యులు ఈ సదుపాయం వల్ల సమయానికి చికిత్స పొందే అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ వైద్య సిబ్బంది ప్రజా ప్రతినిధులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సిటిస్కాన్ సేవలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి

మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి,చిత్రంలో అదనపు కలెక్టర్,డీఏవో

అధిక ధరలకు అమ్మితే

లైసెన్సులు రద్దు

యూరియా పంపిణీపై కలెక్టర్ విజయేంద్ర బోయి సమీక్ష

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు29,ప్రభాతవార్త : రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఫెర్టిలైజర్ డీలర్స్,వ్యవసాయ శాఖ ఏ.డి.లు, మండల వ్యవసాయ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు యూరియా అందించడంలో ఎక్కడ ఎలాంటి అవకతవకలు జరగడానికి వీల్లేదని, గుళికలు, ఇతర మందులు, వస్తువులు గాని కొంటేనే యూరియాను అమ్ముతామని ఒకదానికి ఒకటి లింకు చేయరాదని హెచ్చరించారు గోడౌన్‌లో యూరియా పక్కకు తీసి పెట్టి చిన్న రైతులకు లేదని చెప్పడం లాంటివి చేయరాదని, రెగ్యులర్‌గా పెద్ద మొత్తంలో కొనే రైతుల కొరకు చిన్నరైతులకు యూరియాను ఆపకూడదని, సూచించారు ఎం.ఆర్.పి. ధరలకే యూరియాను అమ్మాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎం.ఆర్.పి. ధరల కంటే అధిక రేటుకు, బ్లాక్ మార్కెట్లో అమ్మితే డీలర్ లైసెన్స్ రద్దుచేయడం జరుగుతుందన్నారు. నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించాలని డీలర్స్‌కు సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, డీలర్స్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

తుది ఓటరు జాబితాకు అన్ని పార్టీలు

సహకరించాలి

నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త : నారాయణపేట మండల కేంద్రాలు, గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 30 వరకు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఆమె మాట్లాడుతూ అభ్యంతరాలను 31న డిపివో ఆధ్వర్యంలో పరిష్కరించి,సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. జిల్లాలో 650 మందికి మించి ఓటర్లు ఉన్న ఎనిమిది పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు వచ్చినందున పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 30న మండల స్థాయిలో కూడా రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్,నగర అధ్యక్షుడు పోషల్ వినోద్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు సలీం బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, సాగర్, టిడిపి నాయకుడు రాఘవ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

తప్పులు లేని జాబితా

రూపొందించాలి

రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం...!

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, ఆగస్టు 29 ప్రభాతవార్త: గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు తప్పులు లేని జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు.ఆగస్టు 28న గ్రామ పంచాయతీల వారిగా ఎలక్ట్రాల్ రోల్ విడుదల చేసిన నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రతిగ్రామపంచాయతీలో ముసాయిదా ఓటరుజాబితా,వార్డుల వివరాలు, పోలింగ్ కేంద్రాల వివరాలు ప్రకటించడం జరిగిందని, ఏమైనా అవాంతరాలు ఉంటే ఆగస్టు 30 తేదీన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో పరిష్కరించుకోవాలని సూచించారు. మరణించిన వారి పేర్లు వివరాలు ఎంపీడీఓలకు ఇవ్వాల్సిందిగా సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, డిపిఓ రఘునాథ్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

పుట్టిన గడ్డ

రుణం తీర్చుకుంటా..

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

- పెద్దదగడలో రూ.3కోట్లతో ఆడిటోరియం,తిరుమల నాథస్వామి ఆలయ నిర్మాణానికి రూ.కోటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- జెడ్పీ హైస్కూల్‌కు రూ.50లక్షలు మంజూరు
- చిన్నంబావి, పాన్‌గల్ మండలాల్లో పర్యటన

చిన్నంబావి, ఆగస్టు29, ప్రభాతవార్త : తాను పుట్టి పెరిగిన ఊరికి మంచి పేరు, వైభవం తీసుకురావాలనే ఉద్దేశ్యంతో పెద్ద దగడ గ్రామ పంచాయతీలోని పురాతన దేవాలయం శ్రీ తిరుమల నాథ స్వామి దేవాలయ నిర్మాణానికి రూ. ఒక కోటి, మల్టీలెవల్ కల్చరల్ ఆడిటోరియం నిర్మాణానికి రూ. 3.00 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మంత్రి వనపర్తి జిల్లా పానగల్, చిన్నంబావి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వంత గ్రామం అయిన పెద్ద దగడలో పురాతన రాజుల కాలం నాటి శ్రీ తిరుమల నాథ స్వామి దేవాలయ అభివృద్ధికి రూ.4కోట్లు మంజూరు చేసిన ఉత్తర్వు కాపీలను దేవాలయ కమిటీకి అప్పగించారు. గ్రామంలో వివాహాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు మల్టీలేవల్ కల్చరల్ ఆడిటోరియం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.నెలరోజుల్లో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి ఆరు నెలల్లో ప్రారంభోత్సవం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో రోడ్లు బాగు చేయించడం, డబుల్ రోడ్లు వేయడానికి రూ.200 కోట్లు మంజూరు చేయించుకోవడం జరిగిందని, అందులో భాగంగ చిన్నంబావి మండలములో సైతం అన్ని రోడ్లు వేయించడం జరుగుతుందని తెలియజేశారు. అంతకు ముందు మంత్రి స్వామి వారిని దర్శించుకోగా దేవాలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు రాని వారికి ప్రత్యేకంగా అదనంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించుకొని అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. చిన్నదగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంత్రి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడిన మంత్రి వర్షం పడిన ప్రతిసారీ పాఠశాల భవనం కురుస్తుందని, భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్తగా మంజూరు అయి నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేసి వెళ్లిపోయారని ఉపాధ్యాయులు, విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి పాఠశాల నిర్మాణానికి 96 లక్షలు మంజూరు చేస్తే గత నాలుగు సంవత్సరాల నుండి పూర్తి చేయకుండా మధ్యలోనే అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టును వెంటనే రద్దు చేసి కొత్తగా టెండర్ పిలవాలని పంచాయతీ రాజ్ ఎస్.ఈను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఇప్పటికే మంజూరు అయిన 96 లక్షల నిధులను అదనంగా మరో 50 లక్షల రూపాయలు ఇప్పుడే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్ ఉన్నారు. అంతకముందు పానగల్ మండలం దావాజిపల్లి గ్రామంలో రూ. 196.83 లక్షల వ్యయంతో నిర్మించనున్న 33/11 కే.వి విద్యుత్ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో బుచ్చమ్మ అనే ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఇంటికి భూమి పూజ చేశారు. అదేవిధంగా చిన్నంబావి మండలంలో అయ్యవారి పల్లి గ్రామ పరిధిలో ఒక 33/11 కెవి సబ్ స్టేషన్‌ను శంకుస్థాపన చేశారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే

అభివృద్ధి సాధ్యం

- మహిళా సాధికారతపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 29 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో అప్పుడు, ఇప్పుడు ఎప్పుడైనా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దమందడి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆర్టీసీ బస్సుల కొనుగోళ్లలో మహిళల భాగస్వామ్యం, విద్యార్థులకు పాఠశాల దుస్తుల తయారీ, వడ్డీ లేని రుణాలు, మహిళల భాగస్వామ్యంతోనే డీజిల్ బంకులు, రైస్ మిల్లులు లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేసిందని ఇంకా మహిళలకు - మిగతా4లో..

మంత్రికి వివరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ప్రతి రైతుకు యూరియా అందిస్తాం...

రైతులు అధైర్య పడొద్దు

- ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదు
- వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి,ఆగస్టు 29 ప్రభాతవార్త:ప్రతిరైతుకు సకాలంలో యూరియాను అందిస్తామని,రైతులు ఎవ్వరు కూడా అధైర్య పడవద్దని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం డివిజన్‌పరిధిలోని కల్వకుర్తి,వెల్దండ,చారకొండమండలంలోని వ్యవసాయశాఖ, మార్కెట్ శాఖ, వ్యవసాయ పరపతి సంఘం, ఫర్టిలైజర్ షాపుల యజమానులతో యూరియా కోరత సమస్యపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం డివిజన్ పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం లక్ష 694 ఎకరాల్లో వివిధ పంటలు రైతులు సాగు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో సాగు విస్తీర్ణం తక్కువ నమోదు చేసి పై అధికారులకు పంపడం వల్ల యూరియా రావడం తక్కువ అయ్యిందని, పత్రికల్లో ఇతర ప్రాంతాల్లో వస్తున్న కొరత సమస్య మన డివిజన్‌లో లేదన్నారు. ఎవరైనా రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. అధిక ధరలకు యూరియా విక్రయించిన,యూరియాతో పాటు వేరే క్రిమి సంహారక మందులు కొనుగోలు చేయాలనే నిబంధనలు పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యూరియా తక్కువ వాడాలని, అధికంగా యూరియా వాడితే వచ్చే నష్టాలపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక నాయకులు సమన్వయంతో అవగాహన సదస్సు నిర్వహించాలని తెలిపారు. ఫర్టిలైజర్ షాపుల యజమానులు రవాణా, హమాలి ఖర్చుల కింద బస్తాకు రూ.30లు తీసుకోవడం మంచిదే అధికంగా తీసుకుంటున్న, తప్పుడు లెక్కలు, కృత్రిమ కోరత సృష్టించిన విజిలెన్స్ అధికారులు దాడులు చర్యలు ఉంటాయని, తన వద్దకు నాయకులు, యజమానులు ఎవరు రావద్దు అన్నారు. మంచి వేరుశనగ విత్తనాలు కోసం డివిజన్ పరిధిలో ఉన్న రైతులు వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో రబీకి సాగు చేసేందుకు అవకాశం ఉందని రైతులు ముందుకు రావాలని కోరారు. రాయితీపై వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, మందులు పిచికారీ పంపులు, గింజలు ఆరబెట్టి దానికి తడపాలు అందుబాటులో ఉన్నాయని, రిజర్వేషన్ ప్రకారం వారి పరిధిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో పొందవచ్చు అన్నారు. చివరగా రైతు ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు పెడితే సహించేది లేదని, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో ఉన్న వారు రైతులకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఎడి కిరణ్, తహశీల్దార్ ఇబ్రాహీం, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్ కుమార్, యెన్నం భూపతి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, సంజీవ్ యాదవ్, రమాకాంత్ రెడ్డి,డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులు,పిఎసిఎస్ అధికారులు, మార్కెట్ కమిటీ, ఫర్టిలైజర్ షాపుల యజమానులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

డిజిటల్ కంటెంట్ మా జిల్లాలోనూ

అందజేస్తాం..

- విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే యెన్నం కృషి అభినందనీయం
- ప్రశంసించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు29,ప్రభాతవార్త : మహబూబ్ నగర్ నియోజకవర్గం లో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు మంత్రి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ నియోజకవర్గం లో పదవతరగతి విద్యార్థులకు అందిస్తున్న డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ వాటి వినియోగించడం వలన కలిగే ఫలితాలు, వినియోగించే విధానాలు తదితర అంశాలపై మంత్రికి సుదీర్ఘంగా వివరించారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో కేవలం 60నుంచి 65శాతం పాస్ పర్సెంటేజ్ ఉండేదని, డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్‌ను విద్యార్థులు వినియోగించడం చేత మొదటి సంవత్సరం 21మేరకు ఫలితాలు అధికంగా వచ్చాయని, రెండో సంవత్సరం -మిగతా4లో..

ప్రాజెక్టులకు స్థిరంగా వరద

జూరాల 24గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 29, ప్రభాతవార్త: ప్రాజెక్టులకు భారీ వరద నమోదవుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలు నిండుకుండలను తలపిస్తున్నాయి.ఉమ్మడి పాలమూరు వరప్రదాయిని జూరాలకు భారీ ఇన్‌ఫ్లో నమోదవు తున్నది. దీంతో నిరంతరంగా నీటి విడుదల కొనసాగుతున్నది. జలాశయానికి 1,95,000 ఇన్‌ఫ్లో నమోదు కాగా, 24గేట్లు ఎత్తి దిగువకు 1,23,768క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.554టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. జూరాల ఎడమ కాలువకు 390, కుడి కాలువకు 490 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 1,58,823క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

ఆగని ఆందోళనలు

రోడ్డెక్కిన మహిళా రైతులు

ఉమ్మడి జిల్లాలో యూరియాకోసం ఆందోళనలు ఆగడంలేదు.రాత్రింబవళ్లు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. మళ్లీ పాత రోజులను గుర్తుకు తెస్తున్నారు. యూరియాకోసం చెప్పలను, పాస్‌పుస్తకాలను క్యూలో ఉంచుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో మహిళా రైతులు ఆందోళన చేశారు. సరిపడా యూరియా ఇవ్వడం లేదని ప్రధాన రహదారిపై ధర్నా రాస్తారోకో చేపట్టారు. పోలీసులు రంగప్రవేశం చేసి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

నాలుగు తండాలు

237ఇండ్ల స్థలాల పట్టాలు

- ఉదండాపూర్ ముంపు గ్రామాల బాధితులకు ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్ర బోయి

జడ్చర్ల, ఆగస్టు29, ప్రభాతవార్త : ఉదండ పూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల తండా నిర్వాసితులకు ఆర్ ఆర్ ప్యాకేజీ కింద ఇళ్ల స్థలాల పట్టాలు జడ్చర్ల శాసన సభ్యులు జె.అనిరుధ్ రెడ్డి,జిల్లా కలెక్టర్‌లు పంపిణీ చేశారు. శుక్రవారం జడ్చర్ల మండలం చిన్న గుట్ట తండా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ నిర్వహించారు.ఈ సందర్భంగా శాసన సభ్యులు జె.అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ఉదండ పూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల తండా వాసులకు ఆర్ ఆర్ ప్యాకేజీ కింద ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయడం సంతోషకరం అన్నారు ముంపు గ్రామాల తండాలు ఉదండ పూర్ గ్రామ ఆవాస ప్రాంతం ఒంటి గుడిసె తండా కు చెందిన 11,వల్లూరు గ్రామ ఆవాస ప్రాంత తండాలు చిన్నగుట్ట తండా 52, రేగడి పట్టి తండా 72, తుమ్మల కుంట తండా కు చెందిన 102 మందికి మొత్తం 237 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు అంద చేస్తున్నట్లు తెలిపారు.ఉదండ పూర్ రిజర్వాయర్ నిర్మాణ ముంపు గ్రామ ప్రజలకు ఆర్ ఆర్ ప్యాకేజీ కింద పరిహారం,ఇళ్ల స్థలాలు పట్టాలు,అవార్డ్,రీ సర్వేకు జిల్లా కలెక్టర్ ,రెవెన్యూ అదనపు కలెక్టర్‌తో కలిసిప్రతి మంగళ వారం ఇరిగేషన్, రెవెన్యూ,సర్వే,భూ సేకరణ స్పెషల్ కలెక్టర్ తో సమావేశం నిర్వహించి సమీక్ష చేస్తున్నట్లు తెలిపారు.ఉదండ పూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితులకు ఆర్ ఆర్ ప్యాకేజీ రేటు పెంచుతానని చెప్పినట్లు,పెరిగిన రేటు ప్రకారం డిఫరెన్స్ అమౌంట్ ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఉదండ పూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల 4తండాల నిర్వాసితులు ఇళ్ల స్థలాల పట్టాల కు తమ అంగీకారం తెలిపినట్లు,వీరికి దేవుని గుట్ట తండా పునరావాస కేంద్రంలో ఇళ్ల స్థల పట్టాలు ఇండ్లు నిర్మించేందుకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలు నివాసం ఉన్న గ్రామాలను విడిచి వెట్టి వేరే చోటకు వెళ్లడం బాధాకరం అన్నారు. ముంపు నిర్వాసితులు త్యాగం వలన ఉదండ పూర్ రిజర్వాయర్ పూర్తి వలన 8 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు వస్తుంది అన్నారు. ఉదండ పూర్,వల్లూరు గ్రామ నిర్వాసితులకు అందరికి క్లియర్ గా ఉన్న వాటికి ఆర్.డి.ఓ అవార్డ్ పాస్ చేసి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏనుగు నరసింహారెడ్డి, ఆర్డీవో నవీన్, మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత, మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి, తహసిల్దార్ నర్సింగ రావు పాల్గొన్నారు.

పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, చితంలో కలెక్టర్

"ఆశలకు తప్పని తిప్పలు"

అలంపూర్ ఆగస్టు 29, ప్రభాతవార్త : వినాయకుడి నిమజ్జనం ఉందని చెప్పి ఉదయం నుండి రాత్రి వరకూ డ్యూటీలో ఉండాలని తుంగభద్ర నది బ్రిడ్జి దగ్గర ఉండాలని ఆదేశాలు వచ్చాయి,అయితే ఈ వర్షాకాలంలో ఉండడానికి సౌకర్యాలు లేకపోయినప్పటికీ తాగడానికి నీళ్లు లేకపోయినా, కూర్చోవడానికి కుర్చీ లేకపోయినా నేలమీద అలాగే కూర్చొని కానీ డ్యూటీ చేయాలి, ఎందుకంటే మీరు నిరాశలో ఉన్న ఆశలు కాబట్టి అనే విధంగా పై అధికారులు వీరి పైన వివేక్షతో డ్యూటీలు వేస్తున్నారు. వాస్తవానికి వినాయకుడు నిమజ్జనం రాత్రి 9 నుంచి 10 ,11 గంటల సమయంలో జరుగుతుంది.సాయంకాలం ఉండాల్సినటువంటి ఆశలను ఉదయము నుండే అక్కడ ఉండమని చెప్పడం ఎంతవరకు సమంజసం ఒకవేళ తప్పని పరిస్థితిలో డ్యూటీ చేయాలంటే వాళ్ళకు ఉండాల్సిన ఏర్పాట్లు ఏవి...?తాగడానికి నీలేవి కూర్చోవడానికి కుర్చీలు ఎక్కడ..? వర్షం వస్తే ఎక్కడ పారిపోవాలి...? ఇవేవీ ఉన్నత అధికారులకు కనబడవా..? ఏర్పాటు చేయరా..? మీకో న్యాయం ఆశలకో న్యాయమా ...?ఇది సరైన పద్ధతి కాదని ?ఆర్.ఎస్.పి? టీం తరపున దీని ఖండిస్తున్నాం. తక్షణమే ఆశలకు తగిన ఏర్పాట్లను చేయాలని అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎండలోనే విధులు నిర్వహిస్తున్న ఆశలు

విద్యార్థులు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి

ఆత్మకూర్ ఆగస్టు 29, ప్రభాతవార్త : నేటి సమాజంలో చదువుతోపాటుగా విద్యార్థిని విద్యార్థులు క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సైదులు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం రోజు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థుల చేత క్రీడల పట్ల శ్రద్ధ వహించే విధంగా ప్రిన్సిపల్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి గర్వకారణమైన హాకీ పితామహుడు ధ్యాన్చంద్ జన్మదినోత్సవాన్ని 2012 సంవత్సరం నుంచి ప్రతి ఏటా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి క్రీడల్లో విశేషంగా రాణించేందుకు శ్రద్ధ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఒలంపిక్ గేమ్స్ లో హాకీ పితామహుడు ధ్యాన్చంద్ 400కు పైగా గోల్స్ సాధించి భారత దేశ జాతీయ పతాకాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎగురవేసిన విషయాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థిని విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు విశ్వేశ్వర్, కురుమూర్తి తదితరులతో పాటుగా అధ్యాపక సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

ఘనంగా క్రీడా దినోత్సవ కార్యక్రమం

ఊట్కూర్, ఆగస్టు 29 ప్రభాతవార్త : ఊట్కూర్ మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ బాలుర-బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రధాన వీధులలో విద్యార్థులు ఆకర్షణీయమైన ర్యాలీ నిర్వహించి, క్రీడల ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు. ర్యాలీకి ఎంఈఓ మాధవి ఆధ్వర్యం వహించగా, జీహెచ్‌ఎమ్ కుసుమ, వ్యాయామ ఉపాధ్యాయులు పరిజాతం పాల్గొన్నారు.లయన్స్ క్లబ్ అధ్యక్షులు డి.హన్మంతు, సూర్యప్రకాశ్ రెడ్డి, భారత్‌తో పాటు పలు ఉపాధ్యాయులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు.క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, జట్టుగా పనిచేసే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని ఎంఈఓ మాధవి పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షి ంచారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు హన్మంతు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో ముందుకు రావడానికి తల్లిదండ్రులు, ఉపా ధ్యాయులు ప్రోత్సాహం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. చివరగా పాఠశాల ఆవరణలో చిన్న స్థాయి క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నారాయణపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త : విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో కూడా ప్రతిభ కనబరచాలని స్థానిక శ్రీ చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. మెర్సీ వసంత అన్నారు కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా ఈ దినోత్సవం జరుపుకోవడం గర్వకారణమని అన్నారు. చదువు మానసిక ఉల్లాసాన్ని ఇస్తే క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించాలి"అని సూచించారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు జి. శ్రీనివాస్, సెఫిక్ అహ్మద్, నిర్మలాదేవి, సంగీత అధ్యాపకులు జి.రంగారెడ్డి, డా.శంకర్ కృష్ణారెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇంఛార్జ్ లక్ష్మారెడ్డి, రాజ్‌కుమార్,కళాశాల సూపరింటెండెంట్ జైపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగవాన్ బలరామ జయంతి

నారాయణపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త : నారాయణ పేట జిల్లా కేంద్రంలో శుక్రవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో భగవాన్ బలరామ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా కె.రాజ్‌కుమార్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆనాడే భగవాన్ బలరాముడు రైతుల పక్షాన నిలబడి కృషి చేశాడు ఆయన ఆదర్శాలను అనుసరించి రైతాంగ అభ్యున్నతి కోసం కృషి చేయాలి అని అన్నారు అనంతరం అతిథులను నిర్వాహకులు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ పట్టణ అధ్యక్షులు ఆకుల వెంకటప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకోబా, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, సహాయ కార్యదర్శి ప్రభు మిస్కిన్, ఉపాధ్యక్షులు శరణయ్య, బాలప్ప, విశ్వనాథ్ రెడ్డి, రంగారెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, గోపాల్ గౌడ్ సల్ల వెంకటేష్, వై.సంతోష్ నర్సింహ నాయుడు,ఎం. సంతోష్, శివరాజ్, కృష్ణయాదవ్,నాగురావు, అశోక్, చామకూర నగేష్, నర్సింహ రాజప్ప గౌడ్, తదితరులు పాల్గొన్నారు.అధిక సంఖ్యలో రైతులు, కిసాన్ సంఘ్ కార్యకర్తలు హాజరై బలరామ జయంతి ఉత్సవాలను విజయవంతం చేశారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

ఉప్పునుంతల, ఆగస్టు 29 ప్రభాతవార్త : సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్ కు ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో సిపిఎస్ ను రద్దు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన బోధనాభ్యసన సామాగ్రి మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సిపిఎస్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన వారిలో పిఆర్‌టియు టిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ బిచ్యా నాయక్ తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి అజ్మతుల్లా, రాష్ట్ర బాధ్యులు రాములు నాయక్, ఉప్పునుంతల మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి అమీర్ పాషా,సంఘ సభ్యులు లక్ష్మణ్, గోపి, శ్యామల గౌరీ, కల్పన, రాజవర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు

పీయూ ఇంజినీరింగ్‌లో 191 అడ్మిషన్లు..

ప్రిన్సిపాల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎన్ చంద్ర కిరణ్

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు29,ప్రభాతవార్త: పాలమూరు విశ్వవిద్యాలయం అక్కడమిక్ ఆడిట్ సెల్‌లో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో డైరెక్టర్ అకాడమిక్ ఆడిట్ సెల్ ప్రిన్సిపాల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ ఎన్ చంద్ర కిరణ్ మాట్లాడారు. నేడు లైబ్రరీ ఆడిటోరియంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరవుతారు, సభాధ్యక్షులుగా వీసీ ప్రొఫెసర్ జి ఎన్ శ్రీనివాస్ వైస్ ఛాన్సలర్ పాలమూరు విశ్వవిద్యాలయం నిర్వహిస్తారని తెలిపారు. గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి రమేష్ బాబు పాల్గొంటారని పేర్కొన్నారు.రాష్ట్రంలో మొదటిసారిగా పాలమూరు విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మూడు కోర్సులలో 180 సీట్లకు గాను 191 విద్యార్థులు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ అడ్మిషన్లు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఓరియంటేషన్లో బీటెక్ కోర్సు యొక్క స్ట్రక్చర్, ప్రాథమిక అవగాహన కలగజేస్తారని, సెప్టెంబర్ 1 నుండి 6 వరకు బీటెక్ విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహిస్తామని తెలిపారు. బీటెక్ మొదటి సంవత్సరం తరగతి గదులు అకాడమిక్ భవనము మొదటి అంతస్తులో నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్. వి చంద్ర కిరణ్ వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎండి గౌస్ మొయినుద్దీన్, వైస్ ప్రిన్సిపల్ ఇంజనీరింగ్ కళాశాల, డాక్టర్ ఎం గాలెన్న పాలమూరు విశ్వవిద్యాలయం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్ చంద్ర కిరణ్

విద్యార్థులకు సృజనాత్మకతను పెంపొందించాలి

ఉప్పునుంతల, ఆగస్టు 29 ప్రభాతవార్త : విద్యార్థులు లక్ష్యంతో కష్టపడి చదవాలని, విద్యార్థులకు కృత్యాదర పద్ధతిలో బోధించాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల పిఎం శ్రీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో బోధనాభ్యసన సామాగ్రి మేళ (టి ఎల్ ఎం) కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల స్థాయిలో జరిగిన మేళా కు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో కృత్యాల తో హాజరై మేళా ను నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృత్యా దార పాఠ్యాంశాలను బోధించడం వల్ల విద్యార్థులు త్వరగా నేర్చుకోవడానికి ఆకాశం ఉంటుందని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు కృత్యాదార పద్ధతులు నేర్పడం వల్ల సృజనాత్మకత ప్రదర్శిస్తారని ఆయన సూచించారు .అంతకు ముందు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల వారిగా విద్యార్థులు ప్రదర్శించిన మేళాను సందర్శించారు . సృజనాత్మకంగా నిర్వహించిన ప్రదర్శనను సందర్శించి విద్యార్థులను, ఆయా పాఠశాల ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ,సర్కారు బడుల్లో చదువుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ ప్రాంతంలో బడుగు బలహీన వర్గాల విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్, జిల్లా హెచ్ఎం ల సంఘం అధ్యక్షుడు, కాంప్లెక్స్ హెచ్ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, మామిళ్ళపల్లి ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, ఎస్సై వెంకట్ రెడ్డి, పిఆర్ టి యు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్. బిచ్చా నాయక్, డిటిఎఫ్ నాయకులు రామస్వామి, తపస్ జిల్లా కార్యదర్శి జగదీశ్వర్, సూరం ప్రశాంత్ రెడ్డి (బిట్టు), బీసీ సెల్ మండల నాయకులు మడ్డి తిరుపతయ్య గౌడ్, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మేడమోని భాస్కర్, పాత్కుల రామచంద్రయ్య, అంతటి శేఖర్ గౌడ్, వెల్టూరి రేణయ్య, మేకల రామచంద్రయ్య , మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రదర్శించిన మేళను తిలకిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

మక్తల్ టౌన్, ఆగస్టు 29 ప్రభాతవార్త: ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా మక్తల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ.రవికుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యాలయంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ధ్యాన్ చంద్ వరుసగా మూడు ఒలింపిక్స్‌లో ఒంటి చేత్తో భారత దేశానికి హాకీలో బంగారు పతకాలు తీసుకుని వచ్చాడని, ఆయన జయంతి సందర్భంగా ప్రతి ఏటా జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఎలాంటి సదుపాయాలు లేని సమయంలో, హాకీలో మంత్రముగ్ధులను చేస్తూ, ధ్యాన్ చంద్ చూపించిన ప్రదర్శన అలనాటి జర్మనీ నియంత హిట్లర్‌ను సైతం కట్టిపడేసిందని అన్నారు. ధ్యాన్‌చంద్ మైదానంలో ఉంటే ప్రత్యర్థులు ఆశలు వదులుకునే వారని అన్నారు. అందుకే ధ్యాన్ చంద్‌కు హాకీ మాంత్రికుడు అనే బిరుదు వచ్చిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తూ, సరికొత్త స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చిందని, క్రీడల్లో అత్యున్నత స్థాయికి చేరుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. క్రీడలతో మెరుగైన ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభించి అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. విద్యార్థులకు చిన్న నాటి నుంచే క్రీడలపై ఆసక్తి కలిగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ గుప్తా, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ రవికుమార్, మార్కెట్ డైరెక్టర్లు శ్రీనివాస్, ఫయాజ్, కట్టా వెంకటేష్, మందుల నరేందర్, బోయ వెంకటేష్, ఓబులేష్, అస్మొద్దీన్, కల్లూరి గోవర్ధన్, బ్యాగరి సురేష్, తిరుమలాపూర్ నరసింహ, అఫ్రోజ్, ఆనంపల్లి రమేష్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు అజయ్ డిమాండ్

అమరచింత ఆగస్టు29, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో భూమిలేని పేదలకు ఏడాదికి 12000 వేస్తామని వాగ్దానం చేసిన ఇప్పటివరకు అమలుచేయడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని జిఎస్ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇండ్లు కేటాయించిన ప్రభుత్వ నిబంధనాల మేరకు లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో నిబంధనలు ఎత్తివేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే పెన్షన్లు పెంచుతామని వాగ్దానం చేసిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని ఆయన అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం బేస్మెంట్, పూరి గుడిసె, రేకుల షెడ్డు ఉన్న ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని లేనిచో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనకు పూనుకుంటామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శంకర్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ శ్యాంసుందర్, ఆర్ ఎన్ నాగరాజ్, సుధాకర్, షేక్ భాష, తిరుమల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు అజయ్

నేటి జర్నలిస్టుల మెగా హెల్త్ క్యాంపును విజయవంతం చేద్దాం

నారాయణపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త : జిల్లాలోని జర్నలిస్టులు, వారి కుటుంబాల ఆరోగ్య సంక్షేమం దృష్ట్యా టీయూడబ్ల్యూజే ఐజేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా హెల్త్ క్యాంపు నేడు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నారాయణపేట పట్టణంలోని ఎస్.ఆర్. గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరుగనుంది. ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట మరియు హైదరాబాద్ యశోద ఆసుపత్రి మలక్‌పేట్ వైద్య బృందం సహకారం అందజేస్తోంది శిబిరంలో కార్డియాలజీ,ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, న్యూరాలజీ వంటి విభాగాలతో పాటు బీపీ, షుగర్,ఈసిజీ,2డి ఎకో తదితర వైద్య పరీక్షలు, సేవలు ఉచితంగా అందించనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి, జిల్లా కలెక్టర్ ఎస్పీ హాజరై శిబిరాన్ని ప్రారంభించనున్నారు. అలాగే జర్నలిస్టుల ఆరోగ్య రక్షణ కోసం రూపొందించిన జర్నలిస్టుల హెల్త్ కార్డు దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌తో పాటు, ఆ కార్డు ద్వారా సేవలు అందించే ఆసుపత్రుల పూర్తి వివరాలు తెలియజేయబడతాయి. జిల్లాలో ఇంతవరకు జర్నలిస్టుల కోసం నిర్వహించని ఈ తరహా ప్రత్యేక వైద్య శిబిరం మొట్టమొదటిసారి జరగనుండటంతో,జిల్లాలోని జర్నలిస్టులు,వారి కుటుంబ సభ్యులు తప్పక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీయూడబ్ల్యూజే నాయకులు విజ్ఞప్తి చేశారు.

అడ్డకల్ పోలీస్ స్టేషన్ తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ

అడ్డాకుల,ఆగస్టు29 ప్రభాతవార్త: మండల కేంద్రంలో అడ్డాకుల పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లాఎస్పీ డి.జానకి అడ్డాకల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ సిబ్బంది విధులు,రికార్డులు, పరిసరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈసందర్భంగా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ సిబ్బంది సేవలపై ఏవైనా సమస్యలు ఉంటే తాము పరిశీలిస్తామని, విధుల విభజన (ఫంక్షనల్ వర్టికల్స్) ప్రకారం సమర్థవంతంగా సేవలందించాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ఫిర్యాదుదారులందరికీ సమానంగా సేవలందించాలని, స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడుతూ అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూడాలని సూచించారు.ఇసుక అక్రమ రవాణా, ఇతర అక్రమ కార్యకలాపాలపై నిఘా ఉంచాలని, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లను నవీకరించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. ప్రతి కేసులో నాణ్యత, పారదర్శకతతో విచారణ జరిపి, శిక్షల శాతం పెంచే దిశగా కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లలో 5ఎస్ అమలు తీరును పరిశీలించి, ఫైళ్ల నిర్వహణ పద్ధతులపై మార్గనిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేషనల్ హైవే ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటదని ప్రతినిత్యం హైవే పై ట్రాఫిక్ నియంత్రణను జాగ్రత్తగా పర్యవేక్షి ంచాలని ఎస్పీ తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పట్ల ప్రతి పోలీస్ అధికారి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, హైవేపై రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహించాలని, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు మరియు లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతున్న వారికి కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ప్రమాదాల నివారణకు విజిబుల్ పోలీసింగ్‌ను మరింతగా పెంచాలని, రాత్రి పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహించాలని తెలిపారు. ప్రజల రక్షణే తమ ధ్యేయమని, అందుకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, అడ్డాకల్ ఎస్సై శ్రీనివాసులు, మూసాపేట ఎస్సై వేణు, ఏఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ

93 విద్యార్థులకు ఒకే టీచర్

వెంటనే ఉపాధ్యాయుని నియమించాలి

పెబ్బేరు, ఆగస్టు 29 ప్రభాతవార్త : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పెబ్బేరు శాఖ ఆధ్వర్యంలో పెబ్బేరు చెంచులవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పెబ్బేరు నగర కార్యదర్శి శివ మాట్లాడుతూ చెంచులవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 93 మంది విద్యార్థులకు కేవలం ఒకే ఉపాధ్యాయుడు బోధించడం వలన విద్యా ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఐదు తరగతులకు రెండు మాత్రమే క్లాస్‌రూములు ఉండడంతో పాఠాలు చెప్పడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. కొంతమంది విద్యార్థులను రేకుల షెడ్ కింద కూర్చోబెట్టి చదువు చెప్పడం అనేది ప్రభుత్వానికి, అధికారులకు సిగ్గుపడాల్సిన విషయం. అలాగే మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పలుమార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటికీ పరిష్కారం కాని పరిస్థితి సిగ్గుచేటు" అని ఆయన అన్నారు.

కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి

ఇటిక్యాల ఆగస్టు29, ప్రభాతవార్త: కమ్యూనిస్టు నేత కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ శుక్రవారం మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో సిపిఐ మండల కార్యదర్శి ఆశన్న ఆధ్వర్యంలో దివంగత కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కోసం పీడిత వర్గాల ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రవి. రంగన్న. గ్రామస్తులు లాజరన్న. కాశన్న నాయుడు. శంకరన్న. రామకృష్ణ. జయన్న. కృష్ణ. లింగన్న. రఘు. శేషన్న తదితరులు పాల్గొన్నారు..

రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు నామినేషన్లు

గద్వాల టౌన్,ఆగస్టు29, ప్రభాతవార్త: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జోగులాంబ గద్వాల జిల్లా బ్రాంచ్ ఎన్నికలకు సంబంధించి నేడు (శుక్రవారం) ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడినట్లు ఇండియన్ రెడ్ క్రాస్ ఎన్నికల అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం (15) జిల్లా మేనేజింగ్ కమిటీ స్థానాలకు గాను 14 నామినేషన్లు స్వీకరించబడ్డాయన్నారు. నామినేషన్లు సమర్పించిన అభ్యర్థుల వివరాలు:రీ.మోహన్ రావు, బి.రమేష్,లక్ష్మీనారాయణగౌడ్, బండారి పాల్ సుధాకర్, బాహర్, అక్బర్ భాష, గంగాధర్ గౌడ్,అయ్యపు రెడ్డి, అప్సర్‌పాషా, ధనలక్ష్మి, జయ రామయ్య, నల్లారెడ్డి, రవికుమార్, శ్రీహరి నామినేషన్లు దాహాలు చేసినట్లు ఆయన తెలిపారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

అడ్డాకుల, ఆగస్టు 29 ప్రభాతవార్త: మండల పరిధిలోని రాచాల చెక్ డ్యామ్‌లో భూములు కోల్పోయిన దళితుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, దళితులను మోసం చేసి చెక్‌డ్యాం నిర్మించిన కాంట్రాక్టర్లపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎం. కురుమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ ధర్నా ఉద్దేశించి రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఏ.రాములు, సిఐటియు రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ మాట్లాడుతూ రాచాల గ్రామ శివారులో సర్వే నెంబరు 393,394, 386లలో దళితులకు 8 ఎకరాల భూమి ఉంది. దళిత కుటుంబాలు ఈ భూమిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇందులో మూడెకరాల భూమి ఆక్రమించి చెక్‌డ్యాం నిర్మించి దళితులకు తీవ్ర అన్యాయం చేశారని వాస్తవానికి ఈ చెక్‌డ్యాం రెండు గుట్టల మధ్య కిందికి కట్టాలి. అక్కడ కడితే సంబంధించిన పొలాలు మునిగిపోతాయని, స్వార్థ బుద్ధితో దళితుల భూమి పోయేటట్లు నిర్మించారు. ఇరిగేషన్ అధికారులు కూడా వాస్తవాలను అంచనా వేయకుండా దళితులకు అన్యాయం జరిగేలా చెక్ డ్యాం డిజైన్ చేశారు. ఇరిగేషన్ అధికారుల పైన దళితులను మోసం చేసిన కాంట్రాక్టర్ల పైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు తో పాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. తహసిల్దార్ వాస్తవాలను సర్వే చేసి పై అధికారులతో మాట్లాడి దళితులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళితులకు న్యాయం జరిగే వరకూ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రశాంత్, కెవిపిఎస్ మండల అధ్యక్షులు బాలరాజు, మండల్ నాయకులు ప్రసాదు, శ్రీకాంత్, నర్సింలు, ఆంజనేయులు, రాచాల గ్రామ యువకులు, ఎస్ శ్రీనివాసులు, ఆంజనేయులు, శ్రీనివాసులు, చెన్నకేశవులు, అంజి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం..

- 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి

చెత్తను తొలిగింపచేస్తున్న కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు29,ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవని కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని 24వ వార్డు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ (బీసీ,ఎస్సీ హాస్టల్) ను ప్రిన్సిపాల్ యాదయ్య ఏఎన్ఎం వరలక్ష్మి సమక్షంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. బీసీ హాస్టల్ ప్రాంగణంలో ఉన్న చెత్తను తొలగించి, ప్రక్కన ఉన్న నీటి నిల్వ జేసీబీ సాయంతో శుభ్రపరిచారు. అదేవిధంగా హాస్టల్ కిచెన్, కూరగాయలు, విద్యార్థుల గదులను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. హాస్టల్ విద్యార్థులు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్ సమక్షంలో గృహసమీప పరిశుభ్రతపై వివరాలు తెలియజేశారు.

రైతులు బాగుంటునే దేశం బాగుంటుంది

బిజినేపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త: బలరామ జయంతిని జరుపుకోవడం వ్యవసాయ దారుల దేవుడిని గుర్తు చేసుకునే ఒక సంప్రదాయం అని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులన్నారు. పాలెం, లట్టుపల్లి గ్రామాల్లో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బలరామ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. భరతమాత బలరాముడి చిత్రపటాలకు పూలమాలు వేసి పూజలు చేశారు. కిసాన్ సంఘ్ నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు కలిసికట్టుగా ఐక్యంగా ఉంటే రైతుల ప్రతీ సమస్య వెంటనే పరిష్కారమవుతాయని, గ్రామాల్లోని రైతులు సమస్యలను నిత్యం ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతీ గ్రామంలో పార్టీలకు అతీతంగా భారతీయ కిసాన్ సంఘాన్ని బలోపేతం చేసేలా రైతులు కృషి చేయాలని కోరారు. రైతులు బాగుంటునే దేశం బాగుంటుందని, రైతులు ఐక్యంగా పోరాటాలు చేస్తే ఏ ప్రభుత్వాలైన దిగివస్తాయాని తెలిపారు. బలరాముడు రైతు దేవుడిగా హిందూ సంస్కృతిలో బలం, ఆరోగ్యం కోసం ఆశీర్వాదం కోరుతూ గొప్పగా జరుపుకుంటారు అన్నారు. కార్యక్రమంలో బీరయ్య, మల్లికార్జున్, శివ, ఆకుల గంగాధర్, ఎం. గోవిందు నాయక్ చందు లాల్, టి .వెంకట్ రెడ్డి, సాయిరెడ్డి, వెంకటరెడ్డి, రామిరెడ్డి, రాజేందర్ గౌడ్, గోపాల్ నాయక్, సురేష్, చిన్నయ్య, భద్రయ్య, కృష్ణయ్య, రామ్‌రెడ్డి , గుజ్జ భాస్కర్ రెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనం ఇప్పించాలి

నారాయణపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త: తపస్ నారాయణపేజిల్లా శాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీసం వేతనం ఇప్పించాలని,సమ్మె కాలానికి వారికి వేతనం చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నారాయణపేట జిల్లా శాఖ పక్షాన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవియన్ రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ అదనపు డైరెక్టర్ లింగయ్యలను కలిసి వినతి అందించారు. పదోన్నతులను సవ్యంగా పూర్తి చేసినందుకు వారిని సంఘ పక్షాన సన్మానించారు. సమగ్ర శిక్ష కింద పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని,పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బిల్లులు విడుదల చేయాలని వారికి విన్నవించారు. పదోన్నతుల వల్ల ఖాళీ ఏర్పడిన ప్రాథమిక పాఠశాలల్లో బోధనా సహాయకులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంత రావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి నరసింహ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ గీతా పారాయణం

చిన్న చింతకుంట, ఆగస్టు 29 ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామాలలో శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ మహాగణపతి మండపం వద్ద సామూహిక శ్రీకృష్ణ గీతా పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన శ్రీ శ్రీ సచ్చిదానంద గురు శిష్య బృందం ఆధ్వర్యంలో సామూహిక శ్రీకృష్ణ గీతా పారాయణం పఠించారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో ఆధ్యాత్మిక చింతనతో భగవంతుని సేవిస్తే సకల శుభాలు కలుగుతాయని శ్రీ సచ్చిదానంద గురు శిష్య బృందం సభ్యులు తెలిపారు. శ్రీ గణనాథ మండపాల వద్ద నిర్వాహకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడంపై భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని తహసీల్దార్‌కు వినతి

ఉప్పునుంతల, ఆగస్టు 29 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ సాధారణ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు తోళ్ళ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ ప్రమీలకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల ప్రబారి మండికారి బాలాజీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, మండలంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు ప్రవహించిరోడ్లు దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయని, దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన గుర్తు చేశారు. మండలంలో నెలకొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని వెంటనే పరిష్కరించాలని, ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను సత్వరమే బాగు చేయాలని ,మొల్గర వద్ద హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. మరమ్మతు పనులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చేయాలని ఆయన కోరారు. అలాగే ఎరువుల కొరత లేకుండా రైతులకు సరిపడు యూరియాను సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రబారి మండికారి బాలాజీ, బిజెపి మండల అధ్యక్షుడు మహేష్ యాదవ్, జిల్లా కార్యదర్శి కుందేళ్ళ సైదులు యాదవ్, సోషల్ మీడియా ఇంఛార్జి అఖిల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మొగిలి అంజి, మొగిలి చందు, నాయకులు ఏళ్ల సురేందర్ రెడ్డి, కొండల గౌడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

■ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగ రావు

గద్వాల టౌన్ ఆగస్టు29, ప్రభాతవార్త: మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే, ఈ నెల 30వ తేదీ వరకు తెలియజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 2వ తేదీన వార్డు, గ్రామ పంచాయతీల వారీగా ఫోటోతో కూడిన తుది ఓటరు జాబితాను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో గుర్తింపుపొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను ఈ నెల 28 న ప్రదర్శించడం జరిగిందన్నారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాల విషయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా, ఈ నెల 30 వరకు అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, 31న అభ్యంతరాలను పరిష్కరిస్తామని,అనంతరం సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. ఈ నెల 30న (శనివారం) మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆ సమావేశంలో పోలింగ్ కేంద్రాలు,ఓటరు జాబితా పై అభ్యంతరాలు తెలపవచ్చని కలెక్టర్ సూచించారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారినాగేంద్రం,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో..

తెలంగాణలో వనపర్తి నెంబర్ వన్

◆ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెఘారెడ్డి

పెబ్బేరు, ఆగస్టు 29 ప్రభాతవార్త : సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో రాష్ట్రంలోని 31 జిల్లాల్లో వనపర్తి జిల్లానే టాప్‌లో ఉందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం పెబ్బేరు, శ్రీరంగాపూర్ ఉమ్మడి మండలంలోని 57మందికి రూ.57,06,612విలువైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు,38 మందికి రూ.9,81,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పెబ్బేరుఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే మేఘారెడ్డి పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ మల్లరవి, మంత్రుల సహ కారంతో వనపర్తి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పెబ్బేరు, శ్రీరంగాపూర్ ఉమ్మడి మండలానికి మొత్తం 800 ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. నియోజకవర్గానికి మొత్తం 3500 ఇండ్లను తెప్పిచ్చి ఇచ్చే బాధ్యత ప్రజలందరికి పెద్దపాలేరుగా ఉన్న మీ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీసుకంటాడని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ఇళ్లను నిర్మించుకుంటే వారికి తన స్వంత ఖర్చులతో పట్టుబట్టలు తెచ్చి గృహప్రవేశం చేయించే బాధ్యత తనదేనని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో పెబ్బేరు మండలంలోని రంగాపూర్ నుంచి అయ్యవారిపల్లి వరకు డబల్‌రోడ్డు మంజూరైందని,గత ప్రభుత్వం చేయలేని పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని చెప్పారు. దేశచరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా 26లక్షల మంది రైతులకు రూ.21000 లక్షల మేర రైతు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని చెప్పారు. రానున్న మరో 15 ఏళ్లు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కోదండరాంరెడ్డి,జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్,పెబ్బేర్ ఎంపీడీవో రోజారెడ్డి, తహసిల్దార్ మురళీధర్ గౌడ్, శ్రీరంగాపూర్ ఎంఆర్ఓ, యాపర్ల రామ్‌రెడ్డి, సురేందర్ గౌడ్, వెంకటేష్‌సాగర్, దయాకర్‌రెడ్డి, గంధంరంజిత్ కుమార్, యుగంధర్‌రెడ్డి, బీరం రాజశేఖర్, వెంకటయ్య, సత్యనారాయణరెడ్డి, నరసింహనాయుడు,యువజన కాంగ్రెస్ నాయకులు రాజేష్, శివ కుమార్,సుగురు శివ, ఉమ్మడి మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు పంపిణీ

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

ఉప్పునుంతల, ఆగస్టు29 ప్రభాతవార్త: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ, నరసింహారెడ్డి తనయుడు ప్రవాస భారతీయుడు తిప్పర్తి ప్రశాంత్ రెడ్డి అందించిన ఆర్థిక సహకారంతో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లను శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల పిఎం శ్రీజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులకు పరీక్ష రాయడానికి అధునాతన రకమైన ప్యాడ్లను మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణా నర్సింహారెడ్డి తనయుడు ప్రవాస భారతీయుడు తిప్పర్తి ప్రశాంత్ రెడ్డి అందించిన సహకారం పట్ల ఎమ్మెల్యే ,ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ పంపిన కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్, జిల్లా హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి, ఎంఇఓ చంద్రశేఖర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, మామిళ్ళపల్లి ఆలయకమిటీ చైర్మన్ వేముల నరసింహారావు,సూరం ప్రశాంత్‌రెడ్డి (బిట్టు), ఆ పాఠశాల ఉపాధ్యాయులు శ్యామ్ సుందర్‌గౌడ్,అజ్మతుల్లా, నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీకార్యకర్తలు మేడమోని భాస్కర్,శేఖర్‌గౌడ్, వెల్టూరి రేనయ్య, పెద్దిరెడ్డి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను బోధించాలి

బిజినేపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త: బోధనోపకరణాలతో బోధన సులభతరమవుతుందని,విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తహసిల్దార్ మునిరోద్దీన్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఎంపీడీవో కథలప్ప మాట్లాడుతూ తరగతి గదిలో ప్రతి ఉపాధ్యాయుడు బోధనోపకరణాలతో బోధించాలని ఆదేశించారు. ఎంఈఓ పల్లెర్ల రఘునందన్ శర్మ మాట్లాడుతూ బోధనాభ్యసన సామగ్రి ద్వారా విద్యార్థికి త్వరగా అర్థమై, సృజనాత్మకతకు దోహదపడుతుందన్నారు. ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థుల్లో అభ్యసన స్థాయిలను మెరుగుపరచడానికి టీఎల్ఎం మేళా నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మండలం నుంచి అత్యుత్తమ బోధనా సామగ్రిని జిల్లా స్థాయికిఎంపిక చేశారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులు తయారు చేసిన టీచింగ్ ఎయిడ్స్‌ను మేళాలో ప్రదర్శించారన్నారు. బోధనా సామగ్రి తయారీలో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, సిబ్బంది బాలయ్య, ప్రభాకర్, తిరుపతి సిఆర్‌పిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకునికి ఎమ్మెల్యే పరామర్శ

బిజినేపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త: వట్టెం గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భగవంత్ గౌడ్ మాతృమూర్తి రామ కిష్టమ్మ మృతితో కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పరామర్శించారు. రామ కిష్టమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాని భరోసా కల్పించి మనోధైర్యం కల్పించారు. పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు,మిద్దె రాములు, అమృత్‌రెడ్డి, మలిశెట్టి వెంకట స్వామి, రాగి మధుసూదన్ రెడ్డి, రామకృష్ణ, నరేందర్ గౌడ్, పరశురామ్, పీర్య నాయక్, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

పుట్టినరోజు గుర్తుగా మొక్కలు పంపిణీ చేసిన విద్యార్థిని

మద్దూర్, ఆగస్టు 29 ప్రభాతవార్త: మద్దూర్ మండల పరిధిలోని రెనివట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఐశ్వర్య నేడు తన పుట్టినరోజు సందర్భంగా తనతో చదువుతున్న తొమ్మిదవ తరగతి విద్యార్థులకు పూల, పండ్ల మొక్కలను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజునాయక్ మాట్లాడుతూ విద్యార్థిని ఐశ్వర్య తన పుట్టినరోజు సందర్భంగా మొక్కలు పంపిణీ చేయడం శుభపరిణామం అని ఇలా ప్రతి ఒక్క విద్యార్థి తమ పుట్టిన రోజు గుర్తుగా తమ ఇంటి దగ్గర అయిన కానీ పొలం దగ్గరైన మొక్కలు నాటి వాటిని సంరంక్షించాలని,పుట్టినరోజు నాడు వృధా ఖర్చులకన్న మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరయ్య, బాల్రాజ్, బ్రహ్మయ్య,సాయికుమార్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కర్నూల్‌లో.. ఎమ్మెల్సీ హైదరాబాద్‌లో..

- ఆలంపూర్ ప్రాంత అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా ఉండడం దురదృష్టకరం
- యూరియా సమస్యను తీర్చడానికి ప్రయత్నం చేస్తాం
- రైతులేవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

వడ్డేపల్లి, ఆగస్టు29 ప్రభాతవార్త: గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే గాని, ఎమ్మెల్సీ గాని ఆలంపూర్ ప్రాంత అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా ఒకరు కర్నూలులో.. మరొకరు హైదరాబాద్‌లో నివాసం ఉండే దురదృష్టకర పరిస్థితులు నెలకొన్నాయని ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ విమర్శలు చేశారు. శుక్రవారం రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ముఖ్యమంత్రి ఇచ్చిన స్వేచ్ఛ వల్ల పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దొరికిందన్నారు. గ్రామస్తుల సహకారంతో రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చే కార్యక్రమం జరిగిందన్నారు. దేశంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ బిజెపి పార్టీ తెలంగాణపైన కాంగ్రెస్ పార్టీ మీద వివక్ష చూపడం వల్లేనే ఈ పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. అనంతరం యూరియా కొరతపై ఇజ్రాయిల్ యుద్ధం,ఆపరేషన్ సింధూర్ వంటి సాంకేతిక కారణాల వల్ల ఎరువులు రాకపోవడం వంటి సమస్యలు తలెత్తాయన్నారు. తప్పకుండా యూరియా సమస్యను తీర్చడానికి ప్రయత్నం చేస్తామన్నారు. రైతులేవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కొంతమంది పాత పిఎసిఎస్ చైర్మన్లు అక్కడ క్కడ యూరియాను బ్లాక్ చేసే ప్రయత్నం చేస్తున్నారో దాన్ని కూడా అధికారులతో మాట్లాడి సమీక్షించి ఎక్కడ బ్లాక్ చేసే పరిస్థితి లేకుండా సమర్థవంతంగా రైతులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్నిసంక్షేవ పథకాలు ప్రజలకు అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్ తదితరులు ఉన్నారు.

జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన రాంచరణ్

దేవరకద్ర, ఆగస్టు 29 ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ జిల్లాలోని కౌకుంట్లకు చెందిన రాజా రాంచరణ్ జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పంజాబ్ రాష్ట్రం లూథియానాలో వచ్చే నెల1 నుంచి జరిగే జాతీయస్థాయి యూత్ అండర్18 బాస్కెట్ బాల్ పోటీలకు తెలంగాణ జట్టుకు ఎంపికయ్యాడు. రాజారాం చరణ్ 2023లో అండర్14 విభాగం పాండిచ్చేరి. 2024 అండర్ 16 విభాగం కోల్‌కత్తాలో జరిగిన జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు తెలంగాణ బాలుర జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పుడు మూడో సారి జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్నాడు. జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పో

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

- గంటపాటు స్తంభించిన ట్రాఫిక్..ఏఓ జోక్యంతో ధర్నా విరమణ

యూరియా కోసం భూత్పూర్ హైవే కూడలిలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

భూత్పూర్,ఆగస్టు 29,ప్రభాతవార్త: తమకు యూరియా కావాలంటూ మండల రైతులు భూత్పూర్ హైవే కూడలిలో శుక్రవారం ధర్నా,రస్తారోకో నిర్వహించారు.మండలంలోని పలు గ్రామాల రైతులు శుక్రవారం తెల్లవారుజామునే భూత్పూర్‌కు చేరుకుని ఎరువుల దుకాణాలకు వెళ్లి యూరియా అందుబాటులో లేదని గ్రహించి ఆగ్రహం వ్యక్తం చేస్తూ భూత్పూర్ చౌరస్తాకు చేరుకుని కూడలిలో రోడ్లపై బైఠాయించి ధర్నా నిర్వహించారు.అరగంట పాటు రస్తారోకో నిర్వహించారు.దీంతో భూత్పూర్ చౌరస్తాలో హైవేపై ట్రాఫిక్ స్తంభించి పోయింది.వందలాది వాహ నాలు రోడ్లపై ఎక్కడికక్కడేనిలిచిపోయాయి.పోలీసులురంగప్రవేశం చేసి ధర్నాను విఫలం చేసేందుకు విఫల యత్నం చేశారు.రైతులు ససే మిరా వినకుండా భీష్మించుకుని రస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వా నికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.తమకు యూరియా సరఫరాపై స్పష్ట మైన హామీ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తూ రస్తారోకో నిర్వహించారు.మండల వ్యవసాయాధికారి మురళిధర్ జోక్యం చేసుకుని జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి రెండ్రోజుల్లో యూరియా సరఫరాకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.

పోలీస్ పహారా మధ్య యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

పోలీస్ పహారాలో..

ధన్వాడ, ఆగస్టు 29 ప్రభాతవార్త: ధన్వాడ మండలంలో యూరియా కొరతతో రైతులు అల్లాడి పోతున్నారు,ఉదయమే సింగల్ విండో కార్యాలయానికి ఫర్టిలైజర్ దుకాణాలకు క్యూ కడుతున్నారు శుక్రవారం ధన్వాడ సింగల్ విండో కార్యాలయంలో పంపిణీ చేశారు. రైతులు పెద్ద సంఖ్యలో యూరియా కోసం కార్యాలయం వద్ద గంటలు తరబడిగా పడిగాపులు కాశారు పోలీసు పహార మధ్య యూరియాను పంపిణీ చేశారు. యూరియా కొరతపై రైతులు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు యూరియా కొరత ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. గేటు బయట రైతులు యూరియా కోసం గంటలు గంటలుగా ఎదురుచూసిన సింగిల్ విండో సిబ్బంది నిరక్ష్యంతో అనుకున్నంత యూరియా దొరకడం లేదని రైతులు వాపోయారు. కొంత మంది రైతులు అక్కడే ఉన్న సింగల్ విండో చైర్మన్ వెంకటరామిరెడ్డితో యూరియా కొరతపై రైతులు నిలదీశారు. యూరియాను అందించాలంటూ చైర్మన్‌తో వాగ్వాదానికిదిగారు. అంతేకాకుండా యూరియా కొరతపై వ్యవసాయ అధికారులును సైతం నిలదీశారు చేసేదిలేక వ్యవసాయ అధికారులు విండో చైర్మన్ ఊరుకుండిపోయారు.

ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఏసీబీ అధికారులు

నారాయణపేట, ఆగస్టు29 ప్రభాతవార్త: నారాయణ పేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం చౌరస్తా వద్దగల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం ఏసీబీ అధికారులు ఆకస్మికతనిఖీలు నిర్వహించారు.బాలకృష్ణ ఆధ్వర్యంలోని ఏసీబీ బృందం ఉపాధ్యాయుల పనితీరు విద్యార్థుల విద్యాప్రమాణాలు,వసతి,భోజనం,పారిశుద్ధం, తాగునీటి సదుపా యాలను పరిశీలిం చింది అదేవిధంగా తూనిక కొలతలు, శానిటేషన్,ఫుడ్ ఇన్స్పెక్టర్‌తో కలిసి ఆహార నాణ్యతను కూడా పరిశీలించారు.తనిఖీ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న అడ్మిషన్లకు సంబంధించిన రికార్డుల ను పరిశీలించిన ఏసీబీ అధికారులు, నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు.

క్రీడల ద్వారా అత్యున్నత శిఖరాలను అధిరోహించాలి

నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త: కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు.జీవితంలో క్రీడల ద్వారా అత్యున్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎనిమిదో తరగతిలో చదువుతూ ఖోఖో క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికై ఝార్ఖండ్ రాష్ట్రంలో ప్రతిభ కనబరిచిన రాఘవేంద్రను శాలువా మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ గురుకులపాఠశాల దామరగిద్దలో తొమ్మిదవతరగతి చదువుతున్నారు. కలెక్టర్ మాట్లాడు తూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసమే కాకుండా జీవితంలో స్థిరపడే అవకాశాలు లభిస్తాయి. చదువుతో పాటు క్రీడలలో రాణిస్తే ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలను పొందవచ్చు ఆరోగ్య పరిరక్షణకు కూడా క్రీడలు ఎంతో ఉపయోగకరం అని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్,పీడీ గణేష్, పీఈటీ హేమలత,కోచ్ చక్రవర్తి తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

పోలీసు పెట్రోల్ బంక్ నిర్మాణం పనులను పరిశీలించిన ఎస్పీ

వనపర్తి, ఆగస్టు 29 ప్రభాతవార్త: పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి మండలం రాజపేట గ్రామ శివారులో గాయత్రి పాలిటెక్నిక్ కళాశాల పక్కన నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ పెట్రోల్ బంక్ నిర్మాణం పనులను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పరిశీలించారు. నిర్మాణం పనుల్లో రాజీపడొద్దని నాణ్యతగా ఉండాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వినియోగదారుల అభీష్టం మేరకు నాణ్యతతో కూడిన ఇంధనం సరఫరా జరుగుతుందని ఇందుకు సంబంధించిన పోలీసుశాఖ పర్యవేక్షణ నిరం తరం ఉంటుందని ఎస్పీ అన్నారు. నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తిచేసి పెట్రోల్ పంపు ప్రజల కు అందుబాటులోకి తీసుకువస్తామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్,సైట్ ఇంజనీర్. నరేష్, ఏఆర్ఎస్సై, నాగరాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న కర్ణాటక మంత్రి

అలంపూర్ ఆగష్టు 29, ప్రభాతవార్త: అష్టదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం రోజు కర్ణాటక రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి వర్యులు ఎన్.ఎస్.బోసురాజు వారి సతీమణి తో కలిసి జోగులాంబ గద్వాల జిల్లాలోని శ్రీశ్రీ బాలబ్రహ్మేశ్వర జోగులాంబ అమ్మవారి నీ దర్శించు కోవడం జరిగింది.వారికి ఆలయ ప్రధాన అర్చకుడు డిండిగల్ ఆనంద్ శర్మ,స్వాగతం పలికిన ఎఐస సి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ ,మహాలక్ష్మీ మ్మ దంపతులు ,అనంతరం వారిరువురు కలిసి శ్రీ. జోగులాంబ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు మరియు హోమన్నీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వీరు వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మెన్ కుమార్, దేవాలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు,మార్కెట్ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు మహేష్ గౌడ్, జానయ్య,రాముడు,నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

2500భృతి, పింఛన్లు, అమలు చేసేది ఉందన్నారు. పెద్దమందడి మండలానికి మార్కెట్ గోదా ములు పెద్దమందడి, వనపర్తి రోడ్డు పనులు త్వరలోనే చేపడతామని తెలిపారు. నిరుపేదలకు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు.ఇసుక కావలసిన లబ్ధిదారులు అధికారులకు ముందస్తు సమాచారం అందించి సమకూర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలోవనపర్తి వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఉపాధ్యక్షులురామకృష్ణారెడ్డి, మాజీ జడ్పిటిసిలు వెంకటస్వామి, రమేష్ గౌడ్, గట్టు యాదవ్, మణిగిల్ల తిరుపతిరెడ్డి, టైలర్ రవి, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కంటెంట్ మా జిల్లాలోనూ అందజేస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

మరింత పెరిగి 92 వరకు పాస్ పర్సెంటేజ్ చేరిందని, ఈ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి శతశాతం అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ తో పాటు డిజిటల్ బోర్డు లో వినియోగించే డిజిటల్ స్టడీ మెటీరియల్స్ తన జిల్లా లోని విద్యార్థులకు కూడా అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా కలెక్టర్ ఐలా త్రిపాఠి మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాలు పెంచేందుకు ప్రభుత్వ నిధులు కేటాయించి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని అన్ని నియోజకవర్గాల్లో డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేయడానికి తాను కృషి చేస్తానని ఆమె తెలిపారు.

నల్లమల అడవిలో దారి తప్పిన ఇద్దరు వ్యక్తులు

లోకేషన్ ఆధారంగా రెస్క్యూ చేసి ఇద్దరిని కాపాడిన లింగాల పోలీసులు

లింగాల,ఆగస్టు 29 ప్రభాతవార్త: లింగాల మండలంలోని నల్లమల ప్రాంతంలో పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మూగజీవాలకు చెట్ల పసరు కోసం వెళ్ళి దారి తప్పి లోద్ది మల్లయ్య వాగు పెద్దగా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాగు దాటలేక వాగులో ఇరుక్కుపోయారు. ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపిన కథనం మేరకు పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో అప్పాయిపల్లి, గుర్జ గుండాల మధ్యలో మూగజీవాలకు చెట్ల పసరు కోసం వెళ్ళారని, మధ్యాహ్నం అప్పాయిపల్లి గ్రామాని కి చెందిన మొగిలి నిరంజన్ బంధువు కావడంతో ఫోన్ ద్వారా దారి తప్పామని మొగిలి నిరంజన్ తో చెప్పారు. వెంటనే మొగిలి నిరంజన్ లింగాల ఎస్సై వెంకటే శ్వర్లుగౌడ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన ఎస్సై తన పోలీస్ సిబ్బందితో లోకేషన్ ఆధారంగా దారి తప్పిన ప్రాంతానికి చేరుకున్నారు. కురుస్తున్న వర్షాలకు బాణాల రుసుల్ చెరువు నిండిపోవడంతో లోద్ది మల్లయ్య వాగు ఉధృతంగా ప్రవహి స్తోంది.వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో వాగు దాటలేక అర్ధరాత్రి 12 సమయం అయిన కూడా వాగులో ఇరుక్కు పోయారు. వాగు దాదాపుగా 20 మీటర్ల దూరం ఉండడంతో ఎస్సై ముందస్తుగా తమ వెంట తెచ్చుకున్న త్రాడు సహాయం తో రెస్క్యూ తీసుకుని వాగులో ఇరుక్కుపోయిన వ్యక్తులకు త్రాడును నడుముకు కట్టుకోమని చెప్పి సురక్షితంగా ఒడ్డుకు తెచ్చి కాపాడారు. వాగులో ఇరుక్కుపోయిన ఇద్దరు వ్యక్తులను సురక్షితంగా కాపాడడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్‌కి, పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది హుస్సేన్, రాములు, అప్పాయిపల్లి గ్రామస్తులు మొగిలి నిరంజన్, మూడవత్ కృష్ణ, రమావత్ చందర్,వర్య సంతోష్, మాదగౌని రాజు కేతావత్ రవి,బాణాల నలుగురు యువకులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులను సురక్షితంగా కాపాడిన లింగాల పోలీసులు

వాగులో ఇరుక్కుపోయిన వ్యక్తులను కాపాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు

యూరియా బ్లాక్ మార్కెటింగ్ జరిగితే కఠిన చర్యలు

- ప్రతి రైతుకు సమానంగా యూరియా అందేలా అధికారుల చర్యలు - నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 29 ప్రభాతవార్త: నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో వర్షకాలం పంట సాగుకు అవసరమైన యూరియా ప్రతి రైతు వ్యవసాయ అవసరాలకు, రైతులకు చేరేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకో వాలని నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి లు పేర్కొన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ కార్యాలయం నాగర్‌కర్నూల్ నియోజక వర్గం పరిధిలోని బిజినపల్లి, తాడూరు, నాగర్‌కర్నూల్, తెల్కపల్లి, తిమ్మాజిపేట మండలాల పరిధిలోని మండల వ్యవసాయ అధికా రులు, విస్తరణ అధికారులు, సింగిల్ విండో చైర్మన్లు, సింగిల్ విండో సీఈఓలు, వ్యవసాయ ఎరువుల విక్రయ డీలర్లు లతో నియోజకవర్గంలో యూరియా సరఫరాపై నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియో జకవర్గ పరిధిలో వ్యవసాయ రైతులందరికీ యూరియా పంపిణీ సరఫరాను ప్రతి ఒక్కరికి అందేలా అన్ని మండలాల పరిధిలోని ఎరువులదుకాణాల్లో అందుబాటులో ఉంచేలా వ్యవసాయ అధికా రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రైవేట్ డీలర్లు రైతులకు యూరియా తోపాటు అదనంగా ఇతర క్రిమిసం హారక మందులను అందజేయకుండా అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతు వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా యూరియాను పంపిణీ చేసేందుకు చర్యలు తీసు కుంటుందని తెలిపారు. అదే తరహాలో క్షేత్రస్థాయిలో అధికారులు డీలర్లు తప్పనిసరిగా స్టాక్ అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం పరిధిలో ఎక్కడ యూరియాను బ్లాకుల్లో అమ్మ కుండా, ఎక్కడైనా బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రతి రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాకు చేస్తున్నారని ఎమ్మెల్యే ఈసందర్భంగా తెలిపారు.అదే స్థాయిలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ ఎరువుల డీలర్లు రైతులకు అవసరమైన మేరకు యూరియా నందించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ యూరియాను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు, యూరియాతో పాటు ఇతర ఎరువులను రైతులకు విక్రయిస్తే చర్యలు తీసుకుం టామని కలెక్టర్ హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ప్రస్తుతం 120 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని,నేటి రాత్రి వరకు మరో 100 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్లు కలెక్టరి సందర్భంగా తెలిపారు. యూరియా సరఫరా చేసేటప్పుడు ప్రతి రైతు యొక్క పాస్ పుస్తకం ఆధార్ కార్డ్ జిరాక్స్ తప్పనిసరిగా తీసుకోవాలని, రైతు పాస్ బుక్ ఆధారంగానే యూరి యాను,ప్రతి రైతుకు రోజుకు రెండు బస్తాల కంటే అదనంగా అందజేయరాదని తెలిపారు. ఎకరానికి కేవలం ఒక బస్తా మాత్రమే ఇవ్వా లని, అది కూడా పట్టాదార్ పాస్ పుస్తకం తనిఖీ చేసిన తర్వాతే ఇవ్వాలని అదనంగా ఇస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సూచించారు. రైతులు ఎక్కువమంది వచ్చి లైన్లో ఉంటే వారికి మొదటిసారి ఎంత ఇచ్చారు అనే వివరాలను చెక్ చేయాలని సూచించారు. ఏఈవోలు దగ్గర ఉండి పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, జిల్లా వ్యవ సాయ అధికారి యశ్వంత్ రావు, తాడూరు పిఎసిఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, నాగర్ కర్నూల్ పిఎసిఎస్ చైర్మన్ బండారు శ్రీని వాస్ రెడ్డి, తెల్కపల్లి పిఎసిఎస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గం వ్యవసాయ అధికారి పూర్ణచందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, కలెక్టర్ బాదావత్ సంతోష్

అర్హులకు అన్యాయం జరగనివ్వం..

- ముడా నిధుల మళ్లింపు ముమ్మాటికీ నిజమే ..
- కార్యకర్తలను అడ్డంపెట్టుకొని రాజకీయం చేయడం నాకు రాదు
- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి
- జడ్చర్లలో కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ

జడ్చర్ల, ఆగష్టు29, ప్రభాతవార్త: జడ్చర్ల నియోజకవర్గంలో నిర్మిం చిన డబుల్ బెడ్రూం ఇళ్లలో అనర్హులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండనివ్వమని, అదే సమయంలో అర్హులైన వారెవరికీ అన్యాయం జరగనివ్వమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేసారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్లను కూడా అమ్ముకున్నారని, అయితే తాము మాత్రం ప్రతి ఇల్లు కూడా అర్హులకే దక్కేలా చూస్తామని పేర్కొన్నారు.శుక్రవారం జడ్చర్ల కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో కల్యాణ లక్ష్మి-షాదీ ముబా రక్ చెక్కులు,నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మూడ నిధులను మహబూబ్ నగర్ కి మళ్లించ లేదని, దానికి కోసం తాను సంతకం పెట్టలేదని పదేపదే చెప్తున్నారని,అయితే ముడా నిధుల మళ్లింపు ముమ్మాటికీ నిజమని చెప్పారు. లక్ష్మారెడ్డి పెట్టిన సంతకాన్ని ఆధారాలతో చూపిస్తున్నా నని తెలిపారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని డబల్ బెడ్ రూమ్ ఇళ్లలో జడ్చర్లకు సంబంధం లేని ఇతర ప్రాంతాల వ్యక్తులకు కేటా యించి, ఇప్పుడు వారిని తాను వారిని బయటికి వెళ్ళమని చెప్తే పెట్రోల్ పోసుకోమంటూలక్ష్మారెడ్డి అనర్హులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. లక్ష్మారెడ్డి తన కుటుంబంలో తనతల్లి, అన్న గురిం చి విమర్శలు చేశారని, అయితే తాను మాత్రం ఏరోజు లక్ష్మారెడ్డిని వ్యక్తిగతంగా విమర్శించలేదని చెప్పారు. జడ్చర్ల నియోజకవర్గంలో వంద పడక ఆసుపత్రిని నాలాలో కట్టించావు, పైగా నీవు అందు లో వైద్య సిబ్బంది లేదని అంటున్నావు,మరి ఆసుపత్రిని ప్రారం భించే ముందు అందులో వైద్య సిబ్బంది కొరత ఉందని నీకు గుర్తు లేదా అని లక్ష్మారెడ్డిని సూటిగా ప్రశ్నించారు. అందుకే లక్ష్మారెడ్డి కి తాను అసమర్థ మాజీ ఎమ్మెల్యేగా బిరుదు ఇచ్చానని చెప్పారు. ఎవరూ ఆకలితో ఉండకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం అర్హులం దరికీ న్యాయం చేస్తూ కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తోందనీ ఎమ్మెల్యే వివరించారు. మీ అందరి ఆశీస్సులు, సహకారం ఉంటే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తాను" అని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబం సుఖంగా జీవించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ ండ్డి వివరించారు.ఈ కార్యక్ర మంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జడ్చర్లలో రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పట్టుబట్టి.. జైల్లో పెట్టి..

- గంజాయి విక్రయించిన ముగ్గురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు
- అభినందించిన మహబూబ్‌నగర్ ఎస్పీ జానకీ

మహబూబ్‌నగర్,ఆగస్టు 29,ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ పట్టణ ంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈమేరకు శుక్రవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో పత్రికా సమావేశంలో వివరాలు వెల్లడించారు.శుక్రవారం ఉదయం 7గంటల సమయం లో గంజాయి అమ్ముతున్నారనే సమాచారం అందుకోవడంతో, వన్ టౌన్ ఎస్ఐ సీనయ్య సిబ్బందితో కలిసి టిడిగుట్ట మైదానంలో తనిఖీలు చేపట్టారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని షాసాబ్‌గుట్ట లో నివాసం ఉంటున్న సుధాకర్ కుమారుడు కంచిన రాకేశ్ బిలాల్ గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘాపెట్టి గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 1.325 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు అతడిని విచారించగా, గురువారం రాత్రి ఇద్దరు వ్యక్తులకు అమ్మిన ట్లు ఒప్పుకున్నాడు. వారిని కూడా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి డ్రగ్ టెస్టింగ్ కిట్లతోతనిఖీ చేయగా,గంజాయి సేవించినట్లు పాజి టివ్ వచ్చిందని తెలిపారు. ఈ ఘటనపై వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య కేసు నమోదు చేశారు.స్వాధీనం చేసిన గంజాయి నగదు విలువ రూ.33,125 ఉంటుందని, గతంలో కూడా కొంత మందికి గంజాయి విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. వైద్య పరీక్షల అనంతరం నిందితులను కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యాపారంపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను విక్రయించేవారు, వినియోగించేవారు ఎవరైనా తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కేసులో భాగస్వామ్యమైన వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు ఇతర విభాగాల వారికి జిల్లా ఎస్పీ డి. జానకి అభినందనలు తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఏకలవ్యలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

వెల్దండ, ఆగస్టు 29 ప్రభాతవార్త: మండలంలోని గుండాల గ్రామంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో తెలుగు భాషా దినోత్స వ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష అభివృద్ధికి కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోడం భాస్కర్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాషలో మొదటి అక్షరం "అ"ఆకృతిలో కూర్చుని, తెలుగు భాష పట్ల గౌరవాన్ని చాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రీనా పాంచల్,ఉపాధ్యాయులు అనిల్, అవనీష్,వేద్ పాల్,దీపక్, చంద్రబాబు,ఇలియాస్,కీర్తి, అనీషా,గీతు,కవిత,అరుణ, అఖిల పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలుపండి

- నేడు మండల స్థాయిలో సమావేశాలు
- ఓటరు జాబితాపై కలెక్టర్ విజయేంద్ర బోయి ఆల్ పార్టీ మీటింగ్

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 29,ప్రభాతవార్త: గ్రామ పంచా యతీ ఎన్నికల -2025 నిర్వహణ పై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కలెక్టరేట్ వి.సి.కాన్ఫరెన్స్ హాల్ సమావేశ మందిరంలో శుక్ర వారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ఈ సమావేశం ఏర్పాటు చేయనైనదని, వార్డుల వారీగా, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా షెడ్యూల్‌పై అవగాహన కల్పించారు. మండల స్థాయిలోశనివారం వివిధ రాజకీయ పార్టీలప్రతినిధులతో సమావే శాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.గురువారం (28.8. 25)న ముసాయిదా వార్డ్ వారిగా ఓటర్లు జాబితా జాబితా గ్రామ పంచాయతీలు,మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రచురిం చడం జరిగినదని, అట్టి జాబితాలో ఏమైన అభ్యంతరాలు ఉన్నచో ఆగస్టు 28నుండి ఆగస్టు 30వ తేదీ సాయంత్రం లోగా ఎం.పి.డి.ఓ కార్యాలయం లో లిఖిత పూర్వకంగా అభ్యంతరాలను తెలపాలని, అభ్యంతరాలను స్వీకరించిన ఎంపీడీవోలు పరిశీలించి తగు సవరణలు చేసి తుది జాబితా ప్రచురణ జై జిల్లా పంచా యితీ అధికారికి సమర్పించాలని, అలాగే పోలింగ్ స్టేషన్ల జాబితా జిల్లా కలెక్టర్ కు ఆమోదం కొరకు సమర్పించాలన్నారు. సెప్టెంబర్ 2న వార్డ్ వారీగా తుది ఫోటో ఓటర్ జాబితాను ప్రచురించడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో స్థాని